కథానిక

# తెగని సమస్య

పి. వి. పల్లి

మా మధుసూధనరావు నన్ను రమ్మని ఉత్తరం రాశాడు. వాడిన పదాలుబట్టి చూస్తే త్వరగానే వెళ్ళాలనిపించింది. మర్నాడే బయలుదేరాను, ఆఫీసుకు రెండురోజులు సెలవుపెట్టి ఆదివారం కూడా కలిసివస్తుందన్న వూహతో.

పండగవెళ్ళి పదిహేను దినాలయినాకాలేదు, అత్తారింటినించి వచ్చిన మధు ముఖం పేలవమయిపోయింది. నిరాశాపూరితంగావుంది అతని మనసు. నన్నుచూచి ముఖంకొంచెంకళకళలాడింది. ఏదో అనూహ్యమైన కారణం వుండివుంటుందని తీర్మానించుకున్నాను.

నేను వచ్చినవార్త విన్నతరువాత, వాడితోటి మేష్టర్లు, యింకా యితర స్నేహితులు మొత్తం సుమారు పదిమందిదాకా పోగయ్యారు. అందరం సావిట్లోనే ఆసీనులమయ్యాం. మధు అందరికీ కాఫీ యిచ్చాడు.

ఆమాటా, యీ మాటా అయింతర్వాత నేనే అడిగాను,

"బ్రదర్. ఏదో కొంప మునిగినట్టు వుత్తరం రాశావు..."

"అవును చంద్రం" మళ్ళీ నిస్పృహ ఆవరించింది ముఖాన్ని.

"మనవాడికి మతిచలించింది—" అన్నాడు ఓ మేష్టరు.

"కాదుబ్రా—ఏంమాట. అలాంటి అవమానం నీకే జరిగితే..." స్నేహితుడొకడు మధుని సైడ్ చేశాడు.

"ఇంతకీ ఎవరి అదృష్టం ఎలావుంటుందో—" ప్రాచీనఫక్కీలో ఒకాయన.

అసలు విషయమేమిటో నాకు సరిగా అవగాహన కాలేదు. మనస్సును ఊరడించి,

"అసలు సంగతేమిట్రా మధూ" అడిగానుమళ్ళీ.

"మిగిలిన లాంఛనాలు జరిపించినా జరిపించకపోయినా రిస్టువాచీ అయినా యివ్వక్కర్లేదూ" ఉద్రేకపూరితంగా అన్నాడు మధు.

"ఓస్. యింతేనట్రా..." నవ్వాను పకాలుమని.

మధు రోషావేశపూరితుడైపోయాడు.

"అవును మీ అత్తారు నీకు వాచీ యిచ్చారు గనుక నీవు నవ్వుతున్నావు" ఉడుకుమోత్తనమనిపించింది మధుకి.

నవ్వడం ఆపి—

"యీ విషయం ఆ వుత్తరంలోనే వ్రాసేస్తే సరిపోయేదిగదూ? ఇంతదూరం నన్ను రప్పించింది యీ విషాదవార్త చెప్పడానికా?" అడిగాను, మహావిచారించిన వాడిలా.

"అదికాదోయ్ చంద్రం—జరిగింది ఎలాగో జరిగిపోయింది; కాని దానికోసం యెందుకు విచారము. అంచేత మనమే వాచీ కొనుక్కోవడం సముచితమంటాను నేను" అన్నాడొక ఉపాధ్యాయుడు రాజీమార్గంగా.

"ఇంతకీ మనకి లేకపోతే కదుటోయ్..." ఘరానాతనం ఉట్టిపడేట్టు మాటసాయం చేశాడు స్నేహబృందంలో సుదర్శనం.

"అలాగే, నువ్వే ఓవాచీ కొనుక్కోరాదూ—వాళ్ళిచ్చేదేమిటోయ్. వాళ్లకి సిగ్గొచ్చేట్టు మనం చేదాం" అన్నాను ఊరడింపుగా.

మధు ముఖం విప్పారింది. దించినతల మీదికెత్తాడు.

"అంతేనంటావా? మరి వాళ్ళ దగ్గర్నుంచి మనం సంపాదించలేమా?" అన్నాడు మళ్లా నీరసంగా.

"నా మాట విను. మరివాళ్ల వూసు ఎత్తకు" అన్నాను నిక్కచ్చిగా.

"ఏదీ సిగరెట్టు ఇయ్యవోయ్" అడిగాడు సుందరం.

సిగరెట్టు తీసియిచ్చాను.

"అదేమిటోయ్! మద్రాసులేని ఆంధ్రరాష్ట్రంలాగు సిగరెట్టు యిచ్చి వూరుకున్నావు. అగ్గిపెట్టి కూడా యివ్వు" అన్నాడు సుందరం.

అందరం ఫకాలూ నవ్వాం. మధు కూడా నవ్వేశాడు.

మళ్ళీ కోపంగా చూస్తూ "అవునవును మీకు నవ్వులాటలు..." అన్నాడు.

"అసలు యీ రిస్టువాచీ సమస్య యీనాటిది కాదు. వాడి పెళ్ళి దగ్గర్నుంచీ పట్టుకుంది యీ సమస్య"అన్నాడు మధు పెత్తండ్రి కొడుకు భద్రం.

"ఆc, అలాగా. నాకెప్పుడూచెప్పావుకావేం మధూ?" అడిగాను.

"ఎందుకులేరా—గతజల సేతుబంధనం—"అనేశాడు.

"నేను.చెపుతావిను, అయితే—" అన్నాడు భద్రం.

చెప్పడం మొదలుపెట్టాడు.

"వాడు చిన్నప్పటినుండి వాచీ అంటే సరదా పడేవాడు ఇతరుల చేతివాచీల్ని ఎరువుగా తెచ్చి ఆనందించేవాడు. ఓమాటు, వాళ్ల మామయ్య చేతివాచీని పెట్టుకుని గ్లాసు పగలకొట్టినప్పుడు, వాళ్ళ నాన్న ఒళ్లు హూనంచేశాడు కూడా. అయినా వాచీమీద సరదాపోలేదు.

స్కూలుఫైనలులో కొచ్చాక—వాళ్ళ నాన్న నడిగాడు. స్కూలుఫైనలు పాసైతే తప్పకుండా కొంటానని మా చిన్నాన్న వాగ్దాన మివ్వడం నాకు బాగాగుర్తు. మధు స్కూలుఫైనలు పాస వడం వాచీకోసమే అంటే అతిశయోక్తి కాదు. ఫలితాలువచ్చిన మూడోనాడు వాళ్ల అమ్మ దగ్గిర యీ వూసుయెత్తాడు. అక్కడనుంచి వాళ్ళ నాన్నదగ్గిరకి పోయింది వార్త. కేంద్రంలో బేసరతుగా వాచీ సమస్య వాయిదాపడింది. అప్పటినుండి నెల్లాళ్ళదాకా యింట్లో యెవళ్ళ తోనూ మాట్లాడ్డం మానేశాడు "ఎందుకొచ్చింది గోల" అని రాష్ట్రప్రభుత్వం అంటే వాళ్ళ అమ్మ ఆయనతో గట్టిగా చెప్పింది. ఇక తప్పదనుకుని, "యెలాగూ వచ్చే మాఘంలోనో, పాల్గుణం లోనో పెండ్లి కూడా చేసేస్తున్నాం. అత్తారే యిస్తారు" అని సమాధానపరిచాడు మనవాణ్ణి.

"పెళ్లి" అన్న మాట వినగానే మనవాడు ఓ బెత్తెడు మీదికి ఎదిగినట్టయినాడు. ఇక తండ్రి కొనవలసిన అగత్యంవుండదు; మురిపించవలసిన పరిస్థితీ వుండదు. తన కాబోయే మామగారే కొంటారు. కొనకపోతే తను పెళ్లాడనే పెళ్లాడడు. అసలు పెళ్ళిమాటలలోనే నిశ్చయం చేసుకోడానికి సంకల్పించి అప్పటికి వూరు కున్నాడు.

రోజులు గడిచాయి. మార్గశిరం వచ్చింది. సంబంధాలు వస్తున్నాయి. చివరికి, వాళ్ళ అమ్మకి దగ్గిర సంబంధం స్థిరపడింది. అయితే పెళ్ళి మాటల్లో వాచీసంగతి అసందిగ్ధంగానే వుండి పోయింది. ఆమధ్య ఆంధ్ర రాష్ట్రం గురించిన నెహ్రూ ప్రకటనలాగు. అయినా, అలకపాన్పు మీద కూచుని వాచీ యిస్తేగాని లేవకూడదని నిశ్చయించుకున్నాడు. ఆ నిర్ణయానికి మేమందరం సై-అంటే-సై-అన్నాం. ఈ మా నిర్ణయానికి మా చిన్నాన్న (వాళ్ళ నాన్న) కొంచెం కొంచెం మేమిటి బాగానే కోపగించాడు. అయినా తాత్కాలికంగా వూరుకున్నాం; ఆ వూసు మరిచి పోయినట్టు. ఆ అలక పాన్పు మీద కూచునే ఘడియ ఎప్పుడొస్తుందా అని అందరం ఎదురు చూస్తున్నాం. మావాడు అప్పుడు ఓ చక్రవర్తి హోదాలో తయారయ్యాడు.

ఆ యింత సుముహూర్తం రానే వచ్చింది. అలక పాన్పుమీద కూర్చున్నాడు మన మధు. చుట్టూ అమ్మ లక్కలందరూ చేరారు. ఏవేవో పాటలు, మిగతా లాంఛనాలను అయింతర్వాత, పెళ్ళికూతురి పెద్దన్నయ్య వచ్చి "బావగారూ రండి" అన్నాడు. మన మధు, తననికాదన్నట్లు పరధ్యానంగాచూస్తూ కూచుండిపోయాడు. మళ్ళీ పిలిచాడా అనూయకుడు. మధు, మొహం అటు తిప్పి వాళ్ళ పెద్దక్కయ్యవేపు చూచాడు.

ఆవిడ అందుకుంది. "ఎందుకు నాయినా దాపరికం, వాచీ యిస్తేనేగాని వాడు రాడట" అన్నది. ఆయన సేరుగాపోయి మధ్యవర్తితో చెప్పాడు గాబోలు, రవణయ్యగారు దిగబడ్డారు. ఈయన మధుకి వేలువిడిచిన మేనమామ, పెళ్ళి కూతురికి పినతల్లి మొగుడూను.

"రావోయ్ పంతులూ, ఆడదానిలాగ అలుగు తారా?" అంటూ చెయ్యిపట్టుకుని లేవ దీయ బోయాడు మహా చనువున్న వాడికిమల్లే.

"చాల్లే వూరుకో"చెయ్యి విదలించాడు మధు. మళ్ళీ అందుకున్నది వాడి పెద్దక్కయ్య.

దానిమీద ఆయన అన్నాడు—"పెళ్ళి మాటల

నాడు నిర్ణయించుకోలేదు. "లాంఛనం"అన్నాను. అయితే "లాంఛనం" అన్న దాంట్లో "కంపల్సరీ"కి యెక్కడా స్థానంలేదు. అంచేత వాళ్ళు యిస్తేయిస్తారు. లేకపోతే లేదు. ఇంతకీ పెళ్ళికూతురి తండ్రి యిచ్చే వుద్దేశంలో లేదు—"అని.

ఆ మాటల్తో మా కందరికీ బాగా కోపం వచ్చింది. మధు లేచి, గదిలోకి వెళ్ళిపోయాడు. ఎక్కడవిన్నాడో యీ గలభా అంతా, వాళ్ళ నాన్న వచ్చి "మధూ రా—" అని పిలవగానే మేమందరం ముఖాలు దించుకున్నాం. ఎవరమూ అతనిముందు మాట్లాడలేకపోయాం. పెళ్ళి జరిగిపోయింది.

కాని మనవాడికి యింకా వాచీమీద ఆసక్తి పోలేదు. ఇక అత్తవారిచ్చే మార్గంలేదు. కాని మళ్ళీ మరో "ఆశ" మమ్మల్ని ముందుకి పురికొల్పింది. పెళ్ళి అయిపోయి మేం యింటికి బయలుదేరుతూంటే, పెళ్ళికూతురి రెండో అన్నయ్య వచ్చి "ఎలాగు మరో నెల్లాళ్ళలో పండగ వస్తూనేవుంది. అప్పుడు వాచీ యివ్వగలం" అన్నాడు. అయినా మాలో కొందరికి మాత్రం నమ్మకం లేకపోయింది.

పండగనుండి వచ్చాడు మనవాడు. నవ్వుతున్నట్టగుపించాడు. ఏదో లాభం వుందనుకున్నాం. తీరాచూస్తేఎక్కడా అవుపించదు వాచీ. "మరి యెందుకునవ్వుతున్నావు?"అని అడిగాం.

"నవ్వొచ్చి నవ్వేను లక్షాధికారి అయిన మా మామగారు, కొనియివ్వడానికి సాహసించలేకపోయారు"అన్నాడు మధు.

వాళ్ళ నాన్నగారికికూడా కోపంవచ్చింది, తన కొడుక్కి ఏ లాంఛనాలూ జరగలేదని. నిన్న రాత్రి నూరురూపాయిలు ఇచ్చాడాయన, వాచీ కొనుక్కోమని.

ముగించాడు భద్రం...

* * *

"అయితే మరేం—యివాళ్ళే, రాత్రిబండిలో బయలుదేరుదాం"అన్నాను.

"యెంతమంది?" ప్రశ్నించాడు భద్రం.

"యిద్దరు చాలును—"అన్నాను నేను.

"యింతకీ యెలాంటివాచీకొనడం?"సమస్యని లేవదీశాడు సుందరం.

"చంద్రం, నువ్వూ — మా భద్రం-సుందరం ముగ్గురూ ఆలోచించండి ఏ వాచీనికొనడమో." అన్నాడు మధు.

వాచీ సెలక్షనుకోసం యేర్పడిన—మా ముగ్గురితో కూడినఉపసంఘం, నివేదికతయారు చెయ్యాలన్నమాట. "రేపు ఉదయంచెపుతాం"అన్నాను నేను.

"అదికాదు. తెల్లారుజామున రెండుగంటల ప్యాసింజరులో వెళ్ళాలి. ఈలోగానే తేల్చెయ్యాలి"అన్నాడు మధు. "సరే"నని నా యాజమాన్యంక్రిందగల ఆ యిద్దరు సభ్యులూ, నేనూ ఆలోచనలోపడ్డాం.

సుదర్శనం, మరో స్కూలుమేష్టరూ—ఆ యిద్దరూ కలిసి ఎక్కడ కొనడమో స్థలాన్ని నిర్ణయించడానికిగాను స్థలనిర్ణాయకసంఘంగా తయారయ్యారు.

మధూ ఆలోచనలోపడ్డాడు మరోముగ్గురితో కలిసి ఎంత ఖరీదుగల వాచీని కొనడమోనని.

యింతకీ శాంక్షనయిన బడ్జెట్టు నూరు రూపాయిలు. కేంద్రంనుండి అదనంగా ఏ రూపంలోనూ ఆశించడానికి వీలులేదు.

సిగరెట్ల పొగతో రూము అంతా నిండిపోయింది. ఊపిరాడనంతవరకూ వచ్చింది. తలుపులు బార్లా తెరచాం. లైటు ముట్టించాం.

అప్పుడే ఎనిమిది గంటలయింది. భోజనానంతరం మళ్ళీసభలు జరపడానికిగాను వాయిదా వేశాం.

భోజనాలయినాయి. రూములో యెవరి సీట్లల్లో వాళ్లం ఆసీనులయ్యాం.

సుదర్శనం కమిటీ నివేదికను తయారుచేసింది. మధుకి సమర్పించినది. ఒకటి — విశాఖపట్నం. రెండు—విజయవాడ, మూడు—మద్రాసు యీ మూడు ప్రదేశాల్లోనూ యెక్కడనైనా కొనవచ్చునని నివేదించబడింది. కాని నిక్కచ్చిగా ఒక నిర్ణయం చెయ్యలేకపోయింది. కాని ఈ షరాలో పేర్కొన్న దేమంటే,యీ మూడు స్థలాలకన్నా విజయనగరం బాగుంటుందని.

"చంద్రం కమిటీ—యింకా నివేదిక తయారు చెయ్యలేదా?" అడిగాడు మధు.

"మీ నివేదిక తయారయిందా?" అడిగాను.

"ఓ ఎస్-తొంభయి రూపాయిలదాకా కొనవచ్చు వాచీ."

"మధూ రేపు ఆలోచించి చెపతాం—" అన్నాను.

"అలా వీల్లేదు. ఈ సమస్యల్ని పూర్తిగా తేల్చుకుంటేగాని నేను నిద్రపోను" అన్నాడు.

ఇక యెలాగూ వీడు ఒదిలేట్టులేదని మరో అరగంటలో నివేదికని తయారుచేశాం. సమర్పించాం మధుకి. అందులో పేర్కొన్నదేమంటే—

1. తాత్కాలికంగా రెక్టేంగ్యులర్ షేపు వాచీని కొనడం తరువాత-అది బాగులేదని నమ్మకం కుదరగానే వెంటనే రౌండుషేపు వాచీని కొనడం.

2. యీ రెండు పద్ధతులో యిష్టంలేక పోయిన పక్షంలో జేబుగడియారం మంచిది. కారణమేమంటే—చేతికి యెటువంటి అదురులు తగిలినా, రిస్టువాచీ పాడవగల సూచనలు కనబడుతున్నవి, కాని జేబుగడియారం ఏ పరిస్థితులోనూ ప్రమాదానికి గురిఅయ్యేటట్లు కనిపించుటలేదు.

3. ఈ పద్ధతికిగూడ ఇష్టపడనిచో ప్రస్తుతం వున్న సరదా తీరడంకోసం-పాతికరూపాయిలు దాకా వెచ్చించి సెకండుహేండు వాచీ కొనడం, తరువాత శాశ్వతంగా వుంచుకోడానికిగాను అప్పటి పరిస్థితుల నాలోచించి కొత్త వాచీ కొనుక్కోవడం.

మధుకి యేమీ పాలుపోలేదు. మళ్ళీ, మళ్ళీ-చదవమన్నాడు. చదివి వినిపించాను.

"'రామపాదసాగరం' జ్ఞాపకానికి వస్తున్న" దన్నాడు.

"నీకు చెప్పలేమోయ్-నువ్వే ఆలోచించుకో" -అనేశాను.

అప్పటి మధు ముఖలక్షణాలని పరికించినట్లయితే, ఒక పెద్దదేశం ఎంతో ప్రమాదవస్థలో నున్నట్లు-దాని ముఖ్యమంత్రి ఆ సమస్యా పరిష్కారంకోసం విపరీతంగా ఆలోచిస్తున్నట్లూ-గోచరించుతుంది.

ఇంతకీ యేం తీర్పు చెపుతాడోనని అందరం వాడివేపుచూస్తూవుండిపోయాం. వాంచూతీర్పుకోసం ఆంధ్రులంతా చూస్తున్నట్లు

"ఇంతకీ......"ఆగిపోయాడు మధు.

"ఏమిటోయ్ నువ్వనేది?"అడిగాను.

"ఇప్పటికి వాయిదా వేయడంయుక్తమనిపించుతున్నది"అన్నాడు నాయకుడిహోదాలో.

ఇక యెలాగన్నా వాణ్ణి ఒప్పించి వాచీ కొనింపింతామనిపించింది నాకు.

"మధూ-యీ రాత్రికి పడుకుందాం. రేపు మిగతా విషయాలాలోచించుకోవచ్చును" అని ఆనాటి సమావేశాన్ని ముగించాను.

* * *

తెల్లవారింది. నేనూ, మధూ, వాళ్ళ భద్రం—మేం ముగ్గురం, సావిట్లోకూచున్నాం, కాఫీలు త్రాగి. మందిలాగైతే మరానికి చేటన్నట్లు—మరెవ్వరినీ రానివ్వలేదు. బాగోభ్రష్టో మేమే ఒక నిర్ణయానికి రాదలచాం.

ఒకగంటసేపు ముగ్గురం మౌనంలో వుండిపోయాం. నేను వాచీ షేపుగురించీ, మధు ఖరీదు గురించీ భద్రం స్థలం గురించీ ఆలోచించాము. ముందుగా నేనే అన్నాను. "ఒరే అబ్బీ రౌండు షేపు మంచిదిగా కనిపిస్తున్నది. చాలా మంది నాయకుల చేతుల్ని చూచాను. దీనికి మరి తిరుగువద్దు"

"అవును. ఎనభయి—తొంభయి రూపాయిలయితే బాగుంటుంది అంతకన్నా ఎక్కువ కొనలేము. మిగతాసొమ్ము ఖర్చులకి"అన్నాడు మధు.

"సరే బాగానేవుంది. మద్రాసుపోయి కొనుక్కుందాం. అక్కడ నకిలీ సరుకు కాకుండా మంచివే దొరుకుతాయి" అన్నాడు భద్రం.

ముగ్గురం "భేష్"అంటే "భేష్"అనుకున్నాం.

ముగ్గురమూ మధ్యాహ్నం బయలుదేరాం మద్రాసు. మాకు యిరవైమైళ్ళ దూరంలోనే వుంది.

ఎలాగయితేనేం వాచీ కొన్నాం. రేడియం డైలు. సెంటరు సెకండు.

యింటికి వచ్చాము. మావాడి కింకా అనుమానము వెన్నాడుతూనే వున్నది. వాచీకూడా కొంతకాలందాకా పనిచేసి గ్యారంటీ లేకుండా తప్పాగా నడుస్తుందేమోనని.

---

మనిషి సంఘదృక్పథం కలవాడూ, హృదయంకలవాడూ, సహకారభావన కలవాడూ కానిదే మనం అతన్ని "నాగరికుడు" అనలేం—అతడు శాస్త్రీయ పరిశోధనాలయ ప్రపంచంలో ఉన్నాసరే.